# టునీషియా పాలకవర్గ కూటమి 'పొదుపు' విధానాలను వ్యతిరేకిస్తూ కొత్త ఉద్యమం




**డిసెంబరు** నెలంతా బడ్జెట్ సెషన్ సాగింది. బడ్జెట్‌పై చర్చల సందర్భంగా ఫ్రంట్ పార్లమెంటరీ విభాగం బడ్జెట్‌ను ప్రజలపై ప్రభుత్వం చేస్తున్న దాడిగా దూషిస్తూ పార్లమెంటు బయటా, లోపలా చాల క్రియాశీలకంగా వ్యవహరించింది. కాని ఇదేమీ అధికారంలోవున్న మితవాద కూటమి-కొత్తబడ్జెట్‌ను, కొత్త ఆర్థిక చట్టాన్ని 31-12-2017న అత్యధిక మెజారిటీతో ఆమోదింపజేసుకోవడాన్ని అడ్డుకోలేకపోయింది. ఈ ఆర్థిక చట్టం అమలు చేస్తూ తీసుకున్న కొన్ని చర్యలను ప్రకటించిన వెంటనే దేశమంతా నిరసన జ్వాలలు వెల్లువెత్తాయి.

పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే, ప్రత్యేక కమిటీలద్వారా ఈ బిల్లును తలుపులు వేసుకొని చర్చిస్తున్న సందర్భంలోనే పాపులర్ ఫ్రంట్ ఈ బిల్లు గురించి ప్రజలను హెచ్చరించింది. పాపులర్ ఫ్రంట్ ఆర్థిక బిల్లు ప్రత్యేక కమిటీకి అధ్యక్షత వహిస్తుంది. అది ఈ బిల్లులో ప్రజావ్యతిరేక విధానాలున్నాయనీ, దేశంలో నెలకొన్న సంక్షోభాన్ని శ్రామికవర్గంపై రుద్దడానికితప్ప దీనివల్ల ఎలాంటి ప్రయోజనం లేదనీ బహిరంగంగా ప్రజలకు తెలియ జేసింది. నవంబరు నెలలో విస్తృతంగా కరపత్రాల పంపిణీద్వారా, దేశ వ్యాపితంగా ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం ద్వారా రానున్న కష్టాలను తెలియజేస్తూ కార్మికులను, పేదలను జాగృతపర్చింది. బిల్లు ఆమోదమైన మరుసటి రోజే ధరలను పెంచుతూ ప్రభుత్వ ప్రకటన వచ్చింది. కార్మిక పార్టీ అందరికంటే ముందుగా జారీచేసిన ప్రకటనద్వారా ప్రభుత్వం ప్రజలపై యుద్ధాన్ని ప్రకటించిందిని పేర్కొంది. అప్పటినుండి ప్రభుత్వ నూతన విధానాలను వ్యతిరేకిస్తూ ఒక దానితర్వాత ఒకటిగా వివిధ వర్గాలనుండి నిరసనలు వచ్చాయి. ప్రజాఫ్రంట్ నుండి, దాని వివిధ విభాగాలనుండేగాక అనేక రాజకీయపార్టీలు, పౌర సామాజిక సంస్థలు నుండి ఈ నిరసనలు వెల్లువెత్తాయి.

జనవరి మూడు ఉదయానికల్లా రాజధాని నగరంతోబాటు యితర పెద్దనగరాల గోడలన్నీ "మనం దేనికోసం వేచి చూస్తున్నాం" నినాదా లతో నిండిపోయాయి. అంతకు ముందు రాత్రంతా వందలాది మంది యువకులు ఈ నినాదాలను గోడలపై వ్రాశారు. ఇదే పేరుతో నిరసన ప్రచార కార్య క్రమాన్ని ప్రారంభి స్తున్నట్లు ప్రకటించారు. వివిధ నగరాల్లో ఒకేసారి యువకులు సమూహాలుగా ఏర్పడి ఈ క్యాంపెయిన్ యొక్క ఉద్దేశ్యాలను ప్రజలకు తెలియజేశారు. ఎన్నికల సందర్భంగా చేసిన వాగాడంబర వాగ్దానాలపట్ల, ప్రభుత్వ పాలకులపట్ల విశ్వాసం కోల్పోయిన విప్లవ యువత ఈ క్యాంపెయిన్‌కు పిలుపిచ్చినట్లుగా ప్రకటించారు. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిన తరుణంలో ఈ క్యాంపెయిన్ నిర్ణయం జరిగిందని తెలియ చేశారు. ఈ యువత ఈ క్రింది డిమాండ్ల సాధనకు వ్యవస్థీకృతమైందన్నారు.

- సరుకుల ధరలను తగ్గించాలి.
- నిరుద్యోగులకు సాంఘిక, ఆరోగ్య రక్షణ కల్పించాలి.
- అవసరమైన కుటుంబాలకు సబ్సిడీలను పెంచాలి.
- ఈ కుటుంబాల నుండి కనీసం ఒక్కరికి ఉపాధి కల్పించాలి. పేదలకు గృహవసతి కల్పించాలి.
- జాతీయ అవినీతి వ్యతిరేక ప్రణాళికను రూపొందించాలి.
- ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరించడం నిలుపుదల చేయాలి.
- న్యాయమైన పన్ను విధానాన్ని రూపొందించాలి.
- కార్మికవర్గ ప్రయోజనాలను పరిగణలోకి తీసుకొని ప్రత్యామ్నాయ చట్టం ఏర్పడేవరకు కొత్త ఆర్థిక చట్టం అమలును సత్వరం ఆపివేయాలి.

పై డిమాండ్లతో ప్రారంభమైన ఈ క్యాంపెయిన్‌పట్ల వెంటనే యువత, పెద్దలు ఆకర్షితులయ్యారు. 2011లో ప్రారంభమైన విప్లవ ప్రక్రియను అంతంచేయాలనే ఏకైక లక్ష్యంతో వున్న దళారీ బూర్జువాలకు అనుకూలంగా గత ఏడేళ్ళుగా వరుస ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయి. వీరు అనుసరించిన ప్రజావ్యతిరేక విధానాలతోబాటు ప్రస్తుత ప్రభుత్వ చర్యలపట్ల కోపోద్రిక్తులైన వివిధ వర్గాల ప్రజలు ఈ క్యాంపెయిన్‌లో భాగస్వాము లవుతుండటంతో ఈ క్యాంపెయిన్ వేగం పుంజుకుంది.

ఈ ఉద్యమాన్ని పోలీసు బలగాలతో మొగ్గ లోనే తుంచెయ్యాలని చూస్తున్న పాలకుల అణచివేత వైఖరికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన నిరసనలు క్యాంపెయిన్‌కు మరింత ఆజ్యంపోస్తున్నాయి. రాజధాని శివారు నగరాల్లో పోలీసుస్టేషన్లపైనా, పోలీసు గస్తీదళాలపైనా, డిపార్ట్‌మెంట్ స్టోర్లపైనా, బ్యాంకుశాఖలపైనా దాడులు నిర్వహించబడు తున్నాయి. ఈ ఘర్షణల్లో తెబుర్బా(ఇది రాజధాని యొక్క పశ్చిమ శివారు ప్రాంతం)లో పోలీసు వాహనం ఢీకొనడంవల్ల ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. వెయ్యిమందికి

పైగా యువకులను అరెస్టుచేసి విచారణలు కొనసాగిస్తున్నారు. వర్కర్స్ పార్టీ, ప్రజాఫ్రంట్ పార్టీలు ఈ నిరసనోద్యమానికి బాహాటంగా తమ మద్దతును తెల్పాయి. సంకీర్ణ పాలకులు దేశంలో నియంతృత్వ వ్యాపార నిర్వహణ కొరకు అమలుచేస్తున్న నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఈ పార్టీల నాయకులు వీధుల్లోకి వచ్చి గొంతెత్తాలని పదేపదే పిలుపు నిస్తున్నాయి. జనవరి 14న పాపులర్ ఫ్రంట్ ఆధ్వర్యాన రాజధాని నడిబొడ్డున జరిగిన ప్రదర్శనకు కొన్నివేల మంది పౌరులు హాజరయ్యారు. "మనం దేనికోసం వేచిచూస్తున్నాం" కార్యకర్తలు కూడా యిందులో వున్నారు. దేశంలోని ప్రధాన నగరాలలో (సౌసీ, ఫాక్స్, గాఫ్సా, సిడిబేజిద్, కాసెరిన్, బిజెర్టి మొదలైన ఉత్తర, దక్షిణ ప్రాంతాలకు చెందిన మొత్తం పదహారు నగరాలలో) యిలాంటి ఉద్యమాలు నిర్వహించబడ్డాయి. పాపులర్ ఫ్రంట్‌పై, దాని నాయకులపై ప్రభుత్వ ఖర్చుతో మీడియా ద్వారా బురదజల్లించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. జనవరి 12న శుక్రవారం ప్రార్ధనలలో దేశవ్యాప్తంగా వున్న ఐదువేల మసీదులలో పాపులర్ ఫ్రంట్‌ను ప్రమాదకారిగా పరిగణిస్తూ నిరసనలు తెలపాలని 'ఇమాం'లకు ఆదేశాలు యిచ్చారు. కొన్ని వ్యాజ్యాలైతే నేరారోపణకు దగ్గర్లో వున్నాయి. వీటి ప్రభావం వెంటనే కన్పించింది. హమ్మా హమామీ జన్మ స్థలమైన అరేసా గ్రామంలోని వర్కర్స్ పార్టీపై అదేరోజు సాయంత్రం విధ్వంసక దాడులు జరిగాయి.

దీనికి సమాధానంగా పాపులర్ ఫ్రంట్‌తో విశాలమైన రాజకీయ, సామాజికశక్తులు జత కట్టాయి. ఆర్థిక చట్టాన్ని సవరించేవరకు దాని అమలును ఆపివేయాలనే తక్షణ డిమాండ్‌తో ఈ సమీకరణ జరిగింది. ఈ సంఘటన విజయం సాధిస్తే ఈ ప్రభుత్వానికిది చరమగీతం అవుతుంది. అలాగే పోరాటానికి కొత్త దశ ప్రారంభమవుతుంది.

○○○○